# బోధకుడు

"వాడికో గుణపాఠం నేర్పాలి పద్మినీ, యెందుకో తాత్సారం చేస్తున్నావే, నీకింకా ఆశ చావలేదేమో, స్వాధీనం కాకపోతాడా అని యెదురు చూస్తున్నావేమో, వినలేక బోర్ కొడుతోంది" హాస్య మాడింది కొలీగ్ హిల్డా.

"యేదో వింటున్నట్టు ఆచరిస్తున్నట్టు చేస్తే సరిపోలా ఫ్రెండ్స్! మోటుతనం చూపి శాస్తి చేయాలా! నాగరకులము గాదా మనమూ!" అన్నది విడియా.

వారూ ముగ్గురూ డాక్టర్లే. కలిసే చదివారు అదృష్టం కలిసి వచ్చి ఒకే హాస్పటల్లో జాబ్స్ చేస్తున్నారు. ఇంకా పెళ్ళిళ్ళు కాలేదు మధ్యతరగతి వరుడు నచ్చాడు. చిన్న జాబ్‌లో వున్నవాడు నచ్చితే వాడిని పెళ్ళాడగానే వాడి వాళ్ళంతా వచ్చి కూచుని మేస్తూ డబ్బు గూడా లాగుతారని భయం. ధనికుడనుకూలంగా కనిపిస్తే విచారిస్తే వాడికి పెళ్ళైందని తెలుస్తుంది. నిరాశపడతారు. బ్రహ్మచారి యేమో "పెద్ద ఆస్తితో వచ్చే అమ్మాయిని నిశ్చయించేశారు మా వాళ్లు, మీరు నా పెళ్ళికి రావాలి" అని నవ్వుతూ హట్ చేస్తాడు.

అవకాశవాదులు కనక వెయిట్ చేస్తున్నారు, వలవేసినా విలువైన చేప పడట్లూ! ఈ లోపల బోయ్‌ఫ్రెండ్సు పొద్దుపోనట్లా పరిభ్రమిస్తూ వుంటారు. అంతా జాబ్స్‌లో యిరుక్కున్నవారే, విరామ సమయంలో పెళ్ళి టాపిక్ వస్తుంది. నవ్వుతూ హాస్యాలాడుకుంటారు.

సురేష్ అందగాడే, ఆ సంగతి అతనికి తెలుసు. తనకు అంతస్సౌందర్యం గూడా వున్నదనీ, నాన్‌వైలెన్సునీ, దయా ధర్మాన్నీ ప్రాపగేట్ చేస్తున్నాననీ అనుకుంటూ. పరిచితులకు అపరిచితులకు, ఫ్రెండ్స్‌కీ, శత్రువులకి గూడా హితోపదేశం చేస్తాడు. అదొక హాబీ, కొంతమంది హాబీలతోనే ఫేమస్ అయినారు వుద్యోగ లేదా వృత్తిరీత్యా గాక.

సురేష్ వృత్తి చేస్తూ వృత్తిధర్మం నెరవేరుస్తూండగా బోధకుడని పేరుబడ్డాడు. చాలామంది అతని యింటిపేరు మనిషి పేరు గూడా మరిచిపోయారు. ఛామింగ్ పర్సనాలిటీ, కోపమెరుగడేమో, అజాత శత్రువేమో, నవ్వు మొహం, సుందరాకారం, శుచీ, శుభ్రతా, నీట్‌నెస్, నిదానం స్నేహశీలి బోధకుడు. అతని అంతరాలలో తాను అందర్నీ ఆకర్షిస్తున్నాననే భావమున్నది. కొంతమంది తనను "వెర్రివాడల్లే వున్నాడే" అని చూస్తున్నారనుకోడు. పవర్లో వున్నాడేమో, జనులు ఆశ్రితులూ చుట్టూ మూగుతారు.

రత్నంచెట్టి నవ్వుతూ మెట్లెక్కి వచ్చి దణ్ణం పెట్టాడు. ఆయనకి లక్షలు విలువచేసే జ్యూయెలరీ షాపున్నది, ఇద్దరూ లోపలికొచ్చి హాలులో కుర్చీలలో కూచున్నారు,

"యెస్సైగారు మిమ్మల్ని ఆశ్రియించమన్నారు, నన్ను కొద్దిలో ఒడ్డున పడేయగలిగింది మీరొక్కరేనుట, రక్షణశాఖలో మంచి యిన్ఫ్లుయన్సున్నదట మీకు 'యెట్లా పరిష్కరించి, కోర్టుకు పోకుండా, పేపర్లో పడకుండా, శిక్ష పడకుండా చేయగలడొ' గాని

బోధకుడు మొత్తానికి పరిష్కరిస్తాడు చౌకలో. చదివింది న్యాయ శాస్త్రం కాకపోయినా, యేది న్యాయమో బాగా చెప్తాడు. లా పాయింట్సూ చెపుతాడు. నష్టపోకుండా లా వాడుతాడు. చెట్టీ బోధకుడు నీకు బాగా పరిచయమే కదా! వెళ్ళిరా! అన్నారండీ యెస్సైగారు. దయ చూడరూ?" దణ్ణం పెట్టాడు, పళ్ళబుట్ట అందమైనది బల్లమీదుంచాడు.

"నేను మీకు హితం చెప్పానే, మూడోశ్రీజుల్లో కారు తోలటం యొచ్చిందని గర్వంగా చెప్పినప్పుడే, 'డ్రైవర్ని యెంగేజ్ చేయాలి. వాడి సర్వీస్ చూపమనాలి. కారు మెకానిజం వచ్చా లేదా తెలుసుకోవాలి, ఇంతకు ముందెవరి వద్ద నౌకరీ చేశాడు? యెందుకు మానేశాడు? లేదా యెంపుకు తీసేశారు? నడవడి, ఆరోగ్యం తెలిపే సర్టిఫికేట్లు ప్రొడ్యూస్ చేయమనాలి' అని చెప్పాను గదా నన్ను ఖాతర్ చేశారా? లేదు. పోనీ నిరుద్యోగ సమస్య తీర్చినట్టవుతుందని సూచిస్తూ డ్రైవర్ని పేదవాడిని రికమెండ్ చేస్తే యివ్వలేదు మంచి చెపితే చేదైపాయె. శ్రీనివాస అయ్యంగార్ క్రిమినల్ లాయర్, నేను పంపినవానిని డ్రైవర్ని అనుమానించకుండా ననగకుండా. క్రాసెగ్జామిన్ చేయకుండా యెంగేజ్ చేసుకున్నారు. సరికొత్త విలువైన కారు. ఇంతమటుకాయన ఒక్క ఆక్సిడెంటుకి లోనుగాలేదు సంతోషించటమే గాక. 'గొప్ప వుపకారం చేసి పుణ్యం కట్టుకున్నారు బోధకుడు గారూ. మా అబ్బాయి చక్రం బడతాడేమోనని భయపడిపోయినాను. వాడు దుడుకు, మీరు పంపిన అర్జున్ కారుదగ్గరే నిలబడి కనిపిస్తాడు. మెరిసేట్టు తుడవటమే గాక ఫిట్‌గా వుంచుతాడు' అన్నారయ్యంగారు."

"నిజమే సార్. కారు తోలుకుంటూ మీ దర్శనానికొచ్చిన నాడే నవ్వుతూ అన్నారు. 'మీకు పిల్లలు కలగలేదని, పరాయి పిల్లల్ని డాష్ కొట్టేరు. రాలుగాయ పిల్లలు కారుకడ్డంగా పరుగెత్తు తారు. పీకలమీదికి వస్తుంది,' తప్పే చేశాను సార్" చెట్టి ప్రాక్టికల్‌గా చెంపలేసుకుని రెండు చేతులు కలిపి యెత్తి దణ్ణం పెట్టాడు.

"ముందు యీ వ్యవహారం పరిష్కరించండి సార్. మీమాట జవదాటను, నాకు కోర్టన్నా న్యాయవాది అన్నా భయం దయ చూడరూ?" అని వుత్తరీయంతో మొహం అద్దుకున్నాడు.

"మీరు పంపిన డ్రైవర్ని పిలిపించి యివాళే పనిలో పెట్టు కుంటాను. కబురంపితే వూళ్ళో లేదన్నారు వాళ్ల వాళ్లు." పట్టుత్త రీయం, సిల్క్‌లాల్చీ, పట్టుధోవతీ, వేళ్ల కుంగరాలూ, మెళ్లో బంగారు గొలుసు, చెవులకి రవ్వల తమ్మెట్లు, యెర్రని నిలువు బొట్టూ, చేతులు నలుపుకుంటూ చూశాడు చెట్టి.

"అక్షరాలు నేర్వంగానే పుస్తకాలు చదవలేనట్లే, డ్రైవింగ్ రాగానే కారు డ్రైవ్ చేయలేరు. చాలా నేర్వాలి. రూల్సు, రోడ్డు తీరు, పక్కకి తొలగటం, మలుపు తిరగటం, హారన్ వుపయోగం, అద్దంలో వెనుక వాహనం గమనించటం, బురదనేల అలా చాలా పరిశీలించాలని చెప్పాను. యేం జరిగిందీ, యెలా, యెప్పుడు అన్నీ వినాలి" అన్నాడు బోధకుడు.

కుడిచేతి లాల్చీ పైకి లాగి వాచీ చూసుకుని అన్నాడు చెట్టి. "తరుదయ, చెప్పారు. వినిపించుకున్నాను గాదు. డ్రైవింగ్

వచ్చిందని పొంగిపోయినాను, స్వయంగా నిజం చెపుదామనే మను షుల్ని కొట్టుమీదుంచి వచ్చాను. 'శాస్త్రుల్లుగారూ పని నెరవేర్చకు రండి' అని ఆశీర్వదించి పంపారు. పొద్దూకింది. పెద్ద గడ్డిబండీ వెనక పిల్లగాడు నడుస్తున్నాడు. చేతులో చిన్న కర్ర. నేను హారన్ కొట్టాను. గడ్డిమీదున్న మరొకబ్బాయి, 'అటెల్లండి, వంతెన వస్తుం దాపి. బోటు చాలదు' అని చేయి వూపాడు. కుడివేపు యెదురుగా లారీ వస్తున్నది. యెడమవేపు చూస్తే ఆవులూ గేదెలు యింటికెళ్తూ కంటబడ్డాయి. స్లో డౌన్ చేయాలా ఆపేయాలా అని చూస్తుండగానే కారు పిల్లగాడికి తాకింది. కుడివైపు చక్రం తాకి పడిపోయాడు, లారీ వెళ్ళిపోయింది. గొడ్లూ నడిచి దూరమైనాయి. సూర్యుడస్త మించాడు. ఆపి దిగి చూస్తే ఆగిన బండిచక్రం, కారు కుడిచక్రం మధ్య యెనిమిదేళ్ళ పిల్లగాడు కనిపించాడు, బండి ఆగింది రాకపోక లాగినై. వంతెన దగ్గరే యిదంతా. బీట్‌పోలీస్ రానే వచ్చాడు. జనం మూగుతున్నారు. పోలీస్ ఫోన్ చేయగ అంబులెన్సు వచ్చింది త్వరగానే వచ్చింది. హాస్పటల్లో చేర్చాము పిల్లవాడిని, అక్కడే వున్నాను. పిల్లవాడు పోయాడన్నాడు డాక్టరు" అని బాధపడ్డాడు.

"కేసు నమోదైందా? విడుదలమీదే నా దృష్టి" నింపాదిగా అడిగాడు బోధకుడు.

"అయినట్టే వున్నది సార్. మాటిస్తున్నాను మీరు చెప్పినట్టు నడుచుకుంటాను. అంతా అంధకారమైంది, వెలుగు చూడాలి. మీరే చూపాలి. కిమ్మనను" చెట్టి బేలలాగా అయినాడు.

"ఖాదర్?" అని పిలిచాడు బోధకుడు. డ్రైవరొచ్చి యెదురుగా నిలబడి సెల్యూట్ కొట్టాడు.

"మనం కొంతమందిని కలుసుకోవాలి, పక్క గ్రామం వెళ్ళాలి, పట్నంలో యెండుగడ్డి అమ్మి దాంతో జీవిస్తున్న కుటుంబం నష్టపోయింది. వారిని కలుసుకోవాలి. సద్ది చెప్పి నచ్చచెప్పి పని సానుకూలం చేసుకురావాలి. బహుశా రేపు వచ్చేస్తాము, కారు ఫిట్‌గా వున్నాదా? గాస్ తగినంత వున్నాదా?"

"యస్సార్. కారు ట్రబులివ్వదు, టాంక్ నిండా గాస్ పట్టించామివాళే" అన్నాడు డ్రైవర్.

2

"యెలా గట్టున పడ్డారు? కేసు నమోదైందనీ, పోలీసు అధికారి యింటికి మరిదిగారు వెళ్ళి వచ్చారనీ విన్నాను" అనడిగింది తోడుకోడలు గౌరమ్మ. పడగ్గదిలో నేలమీద చాపమీదున్నారిద్దరూ.

"తిరుపతి వెళ్ళి దైవదర్శనం చేస్తామని దణ్ణం పెట్టుకున్నామక్కా. వెంకన్న బోధకుని రూపంలో వచ్చి అదుకున్నాడు. గడ్డి బండీయే గడ్డి బరువుతో నాలుగడుగులు వెనక్కు వేసిందనీ, లారీ చప్పుడికి యెద్దులు బెదరటంవల్ల బండి వెనక్కి నడిచిందనీ, పిల్లవాడు బండీ చక్రం తాకే పడిపోయినాడనీ చక్రం వాడి గుండెలకి తాకిందనీ, కారు పిల్లవాడిని చేరుతూనే అగిపోయిందనీ, తోలేమనిషి

సడెన్‌బ్రేక్ వేశాడనీ ఋజువుచేశారు. లైసెన్సూ చూపారు, యల్ అనే యెర్ర అక్షరమున్న అట్ట కారుకు ముందు భాగాన వేలాడుతున్నదని చూపారు' అన్నది మంగతాయారు చెల్లెలు వరస తోడుకోడలు. గుండెలమీద బరువు దిగిపోయినట్లు చూసింది. వూపిరి పీల్చుకున్నది

"యేమిటీ వదలలేదనుకుంటా?"

"వదలకేం వదిలింది. కేసు రచ్చకెక్కలేదు. కొట్టేశారు. గ్రామపెద్దలను తల్లిదండ్రులను, కులపెద్దలను కలుసుకుని వారికంతా వివరించి, వారి అనుమతి పొంది వారి సలహా ప్రకారం పిల్లాడి తల్లిదండ్రుల చేతులో సంచీ వుంచారు మీ మరిదిగారు. అంత చేతులో పడుతుందని వారాసించలేదేమో, కళ్ళు తుడుచుకుని దీవించి పంపేశారు. కేసు కొట్టేసి, బాసులోనూ, జీపులోనూ, కారులోనూ అంతా తిరిగి వచ్చేశారు. తల్లిదండ్రులను ఓదార్చారు బోధకుడు.

"ఫలహారం తిని కాఫీ తాగి పో అక్కా! నీతో చెప్పుకున్నాక గుండె తేలికపడింది" అని లేవదీసింది తోడికోడల్ని, సాయంకాలం నాలుగున్నర అయింది. ఫాన్ ఆఫ్‌చేసి వంటింటివేపు వెళ్లారిద్దరూ.

3

"మీరు డిన్నర్ పార్టీకి రావాలి" ఇన్‌విటేషన్ బల్లమీదుంచింది సుచరిత, కుర్చీలో కూచున్నది.

"దేనికి విందు? బ్లాక్‌మనీ ఖర్చు చేయటానికా?" బోధకుడు ఆహ్వానపత్రిక అందుకుని చూస్తూ అడిగాడు.

ఓ.౨.౪౮
శ్రీకాకుళం



"గేలి చేయటం మీ హాబీ. మా తమ్ముడి కూతురు పెళ్ళి నిశ్చయమైంది. మంచి సంబంధం. స్టేట్స్‌కి వెళ్తుంది. వరునికి స్టేట్స్‌లో జాబ్. న్యూయార్క్. ఫీడియాట్రిక్స్. స్పెషలిస్టు. నా తమ్ముడు నా మిత్రులను గూడా ఆహ్వానించుకోమని చిన్న కట్ట యిచ్చాడు," నవ్వుతూ చెప్పి మళ్లా అడిగింది. "మీ బోధ వినేందుకు హితోపదేశం పొందేందుకు యెందుకు చాలామంది వస్తారు? వినాలని వున్నది. మీరు సంపాయించుకోరు, యితరులను సంపాదించుకోనీయరు చదివి పాసై, అనుభవం సంపాదించింది సంపాదించటానిక్కాదా? లైఫ్ యెంజాయ్ చేయాలి".

"చేయాలి వద్దనను. కుడీ యెడమా చూడాలి. సంపాదన గూడా నిషా యిస్తుంది. మతిపోతుంది, చేతులు కాలాక ఆకులు పట్టుకునేం లాభమంటాను."

"చూశారా అప్పుడే బోధ అందుకున్నారు. మీ హాబీ బాగా లేదు. సత్యయుగంలో వున్నామా?"

"కాదు. కలికాలం, కలియుగమే. పట్టూవిడుపూ క్షేమమిస్తే, గుంజటానికి హద్దూ అపు లేకపోతే కవి చెప్పినట్టు కూడబెట్టిన సొమ్ము కుడువబోడు. తుదకు దొంగలకగునో. దొరలకగునో" నవ్వుతూ పద్యం చదివాడు.

"బోధకుడే గాక కవి గూడానా" అంటున్నది. కారు హారన్ వినబడింది. వాకిలివేపు చూశారు, పద్మినీ, హిల్డా లోపలికొచ్చారు. నిలబడే నవ్వుతూ అన్నారు.

"హలో ఫ్రెండ్! మీ యింటికెళ్తే శుభలేఖలూ విందుకాహ్వాన పత్రికా పంపటానికెళ్ళిందన్నారు. బోధేనా వింటున్నావు శ్రద్ధగా?"
"అలా కుర్చీల్లో ఆసీనులు కండి" అన్నాడు బోధకుడు.

"బోధ వినే ఓపిక లేదండీ ఇవాళ. కేసులొచ్చాయి. యెమర్జన్సీ కేసులూ చూడాల్సి వచ్చింది. ఆపరేషన్ పనిబడి నిలువుజీతం తీసుకున్నాను" అన్నది కూచుంటూ. హిల్డా కూచున్నది.

బోధకుడు లేచి వెళ్ళి, సాఫ్ట్ డ్రింకులూ ఓపెన్ చేసినవీ, ప్లాస్టిక్ కాగితం ప్లేట్లలో చిప్సూ, స్నాక్సూ తెచ్చి యెదురుగా బల్ల మీదుంచి తాను కూచున్నాడు బుద్ధిగా.

హిల్డా డ్రింక్ స్ట్రా అందుకుని పీల్చి అన్నది." వధూవరులకూ, హితోపదేశం చేసి, బోధకుడుగారు తప్పక రావాలి, రాకపోతే పార్టీలో పెద్దలోపం కనబడుతుంది. మీరు ప్రిపరేషన్ రిహార్సల్స్ అవసరం లేదు. నాల్కమీద బోధ నాట్యమాడుతుంది. ఆశువుగా బోధిస్తారు. వధూవరులకింకా బడిలోకి పోలేదు. యేమని బోధిస్తారో విందాము" అన్నది చిప్స్ తింటూ.

"వరుడు మత్తెక్కే సంపాదనలో పడ్డాడని సుచరిత చెప్పిందిప్పుడే. భార్యా రత్నాన్ని ప్రోత్సహించి, హార్డ్ డ్రింక్ కొద్ది కొద్దిగా అలవాటు చేసినట్టు సంపాదన అనే నిషా యెక్కిస్తాడు. సందేహం లేదు" బోధకుడు జోక్ విసిరాడు.

డ్రింక్స్ పూర్తిచేసి లేచారు ముగ్గురూ. "మీకోసం యెదురు చూస్తాము. రాకపోతే మేమే వచ్చి తోలుకెళ్తాము."

బోధకుడూ లేచాడు.

"మీరు అట్టి విందివ్వాలి మాకు" అన్నది పద్మిని.

"అంటే వెడ్డింగ్ వెలిగించమనా? "బోధకులు ససేమిరా అనటానికి సిద్ధం" అని నవ్వింది హిల్డా.

"మీరూ వెలిగించాలి. ఒక మగవాడినాదుకున్నా ఆదుకున్నట్టే, మగవాడు గొప్పవాడయేది స్త్రీవల్ల నేనని ఫిలాసఫరూ మతగురువూ గూడా అన్నారు" బోధకుడూ హాస్యమాడాడు.

"ఖర్మకొద్దీ బోధకుడు జతపడ్డాడంటే, అన్నిటిలోనూ తల దూరుస్తూ అడ్డుపడతాడు" హిల్డా నవ్వింది.

"జతపడిన భార్యా అడ్డుపడదా? తల దూర్చదా? కలతలూ వస్తాయి, సరిపెట్టుకు పోవాలి. విడిపోయే స్థితి గూడా రావచ్చు. ఒకర్నొకరు మన్నించుకుంటూ పోవాలి. అవసరమైతే క్షమాభిక్ష అడగాలి. కాళ్లూ గడ్డాలూ పట్టుకోవాలి. విడిపోయి వ్యథలకు గురి అయే బదులు అదే మంచి పద్ధతి. గ్రేట్ లీడర్సే అటువంటి వ్యథకు గురైనారు. మన్నన సత్ఫలితమిస్తుంది,"

ముగ్గురూ పకపకా నవ్వారు, "బావుంది బోధ, దాని గూఢార్థం వచ్చినట్టు పడివుండమనీ ఆత్మాభిమానం చంపుకోమనీ" నవ్వుతూనే చేతులూపి వెళ్ళిపోయారు.

4

"హలో! సుచరితా!"

గొంతు గుర్తుపట్టిన సుచరిత అన్నది. "యేమిటి పద్మినీ

విశేషం! గొంతు బాగా లేదు. శాన్నాళ్ళకి రింగ్ చేశావే క్రైసిస్ వచ్చిందా? అదుర్దా నిరాశా వినిపిస్తున్నాయి'' సుచరిత అడిగింది.

''కరెక్ట్‌గా వూహించావు ఫ్రెండ్, నీకు బోధకుని అడ్రెస్ గానీ, ఫోన్ నంబర్‌గానీ, పామ్స్ నంబరుగానీ తెలిస్తే చెప్పు రాసు కుంటాను, ఇంకా రిటైర్ కాలేదనుకుంటాను. అసలు పేరు మరిచి పోయినాను, అవసరమొస్తుందనుకోలేదు. అంత వయస్సున్నట్టు కనపడలేదు యెక్కడుంటున్నాడో తెలిస్తే మంచిదే'' హీనస్వరంబడి గొంతు వణుకుతున్నట్టు వినబడింది.

''నాకూ తెలియదు, ఇంటర్నెట్ ట్రై చేద్దాం, వాకబ్ చేస్తాను. పుష్కరం పైనే అయింది కలుసుకుని. బదిలీలు, హెంగుతూ విదే శాలు వెళ్ళి రావటం రాకెట్ యుగంలో వున్నాం. కాలం పరుగులు తీసిం!. స్వంత మనుషుల మీద భరోసా వుంచితే నన్ను నా యేమరుపాటునూ చేపర్యాను వాడుకుని ముంచేశారు. అప్పుడే యిది రెండోసారి, ఐటీవాడు మెరుపుదాడి చేసి, రెయిడ్ చేసీ యిల్లంతా జల్లెడపట్టి, బొత్తుల బిల్స్, గోల్డ్ బిస్కట్స్, బంగారు కణికలు పైకి తీశారు, నోరు వెళ్ళబెట్టి ఫ్రీజ్ అయినాను'' అని ఆగింది.

''ఓసారి వాడికి గుణపాఠం నేర్పవా అని నన్ను రెచ్చ గొడుతూ కొక్కరిస్తూ వుండేవారు ఫ్రెండ్స్. మంచి కేసులొస్తే శ్రద్ధగా చూస్తూ వింటున్నాను ప్రిస్క్రిప్షన్ రాయాలి. వాళ్ల నా మెడికల్ హాల్లో మందులు కొనుక్కుని వెళ్ళిపోతారు, కాని

సమయానికక్కడే వున్న బోధకుడు వాళ్లకూ నాకూ గూడా బోధ చేస్తుంటే సహనం కోల్పోయి, మెంటల్ డిసీజ్‌తో అవస్థపడుతున్న పేషంటుని బోధకునికి వదిలి, నా బోయ్ ఫ్రెండుతో కారెక్కి పారిపోయి పొరపాటు చేశాను. తర్వాత తారసపడినప్పుడు కోపం లేకుండా నవ్వుతూ అన్నాడు బోధకుడెక్కడందినా 'మై హజ్‌బెండూ' అని వాటేసుకుంటుందిట ఆ పేషంటు. ముస్కాకవేసి చర్చికి తీసి కెళ్లిందిట. అక్కడామె రైవల్ గూడా ఆ నాటకంలో పాత్రధారి అయితే, "యిద్దర్నీ చేసుకోవాలా?" అని నవ్వి, "సర్టిఫై చేశానంటే యిద్దర్నీ పర్మనెంటుగా మానసిక వ్యాధుల మందిరంలో పెట్టిస్తారు ఫాదర్" అని నవ్వి మృదువుగా వదిలించుకుని వెళ్లిపోయాడట బోధకుడు. కాళ్లు చేతులూ చల్లబడి మతిపోయే సమయంలో బోధకుడు గుర్తొచ్చాడు. ఐటీ ఆఫీసర్లు పైకి తీసినవి యింట్లో వున్నాయనీ, పన్ను యెగ్గొట్టారనీ తెలియదు నాకు. ఆర్జనకు వశమైనాను, డబ్బు నిషానిచ్చింది, బోధకుని సాయం కావాలి. నేనిలా శ్లేష్మంలో యీగలాగా తన్నుకుంటుంటే హిల్డా ఫోన్ చేసింది. తాను భీమా కేసులో పీకలవరకు దిగబడిందిట, మోసపోయి డెత్ సర్టిఫికెట్ యిచ్చిందిట. భీమా సంస్థవారు ఘట్టి లాయర్ని పెట్టి అది యాక్సిడెంటల్ డెత్తా హత్యా తేల్చమన్నారుట, లాయరు శ్రమపడి గోరీలో శవాన్ని పైకి తీయించి, ఫోరెన్సిక్ టెస్టులూ పోస్టుమార్టమ్ ద్వారా హత్యేనని నిరూపించాడట. భీమా డబ్బు మూడులక్షలు లాగాలని ఆరు ప్రీమియమ్‌లన్నా ముగియకముందే చంపేశారుట. హిల్డాకి బాగా మొట్టచెప్పారని తేలిందిట. సస్పెండ్ అయింది, లాయర్ క్రాసెగ్జామినేషన్‌కి తట్టుకోలేక బోనులోనే స్మృతి

తప్పి పడిపోయిందిట. హాస్పటల్లో తెలివి వచ్చినప్పటినించీ బోధకుడు అనే తారకమంత్రం జపిస్తున్నాడట. అదీ డైరెక్టరీ తిరగేసిందిట. ఇ–మెయిల్ గానీ ఫోన్ నంబర్ యేవీ లభ్యం కాలేదుట. బోధకుడొక్కడే నన్ను ఒడ్డునపడేసేది అంటున్నది అయోమయంగా వాళ్ల వాళ్లే సైనారో! బోధకుడే యెందుకో! భాగం వాళ్ళవాళ్ళ అందుకున్నారేమో! దానిమీదికి వత్తిడి తెచ్చి డెత్ సర్టిఫికేట్ యిప్పించారేమో!"

"సారీ ఫ్రెండ్ యేడుపులో యేడుపు యెడంచేయి బైట బెట్టనా. మన క్లాస్‌మేట్ మరో ఫ్రెండ్ విడియా గూడా ఫోన్ చేసింది. మర్డర్ కేసులో యిరుక్కుని విలవిల్లాడుతున్నదట. ప్లీహంలో కాన్సరొస్తే ఆపరేషన్ వల్ల నయమౌతుందని నమ్మబలికిందిట, నెప్పి అనేది చివరిదశ అని వారికి తెలియదేమో, ఆమె డిమాండ్ చేసినంత లేదనీ నగలమ్మి తెస్తామనీ భర్తా అన్నా వెళ్లారుట, ఆపరేషన్ ముగించమని రాసిచ్చారుట. వారు రావటానికి మూడురోజులు పట్టింది, ఈ లోపల పేషంటు హెవెన్ చేరింది, "నమ్మబలికావు, మా అమ్మాయి పోయింది యివ్వక్కర్లేదు" అన్నారుట, విడియా ఆల్కహాలిక్ నీవు వినలేదేమో కోపమొచ్చి, "ఆపరేషన్‌కి చెల్లించాలి డబ్బు అక్కడపెట్టి పేషంటును తీసికెళ్లు" అని మార్చురీకి తాళం బిగించి వెళ్ళిపోయింది వాళ్లేమీ తక్కువ తినలేదు. కరపత్రాలచ్చువేయించి పంచేశారు. ముందే డబ్బు అందలేదని చంపింది మాఅమ్మాయిని. శవాన్నివ్వదుట, యెక్కడో దాచింది, సంస్కారం చేసుకోవాలి, కుళ్ళిపోదా? ఈమె మరొక

రాష్ట్రంలోని ప్రైవేట్ కాలేజీకి శవాల్ని సరఫరా చేస్తున్నది. ఆ వ్యాపారంతో మేడ లేవదీసిరట్ట అని ప్రచారం చేశారుట. అంత విషమిస్తుందని వూహించలేదంటుంది. లాయర్ని పెడితే ఒప్పందం మితిమీరటమే గాక, "మొదట శవాన్ని చూపిలవాలి" అన్నాడుట. శవం మాయమైంది అంటుంది. లాయరే మాయం చేయించాడని వలవలా యేడుస్తూ బొంగురు గొంతుకతో ఫోను చేసింది. "బోధకుడెక్కడున్నాడో తెలుసా సుచరితా? వెళ్లి కాళ్ల మీద పడతాను. వాడొక్కడే నన్ని శిక్ష నుంచి తప్పించేది" అని శోకం అందుకున్నది వాళ్ల వాళ్లేమైనారో? యెందుకు ఒంటరిదైందో?"

"వాల్మీకికి తెలిసివచ్చిందదే పాయింట్ ఫ్రెండ్. ఆత్మీయులయేదీ యెవరయేదీ పుణ్యము, పేరూ, ప్రతిష్ఠ, హోదా, డబ్బు, సౌఖ్యమూ పంచుకుంటారు గాని, పాపము, నేరమూ, శిక్షా పంచుకోరని తెలిసి, వారిని విడిచి నారదమహాముని వెంట వెళ్ళిపోయ్యాడు."

"ఫిలాసఫీ, పురాణగాథల్లూ గాదిప్పుడు కావాల్సింది, బోధకుని గాలించి పట్టాలి."

"పెళ్లాడిందని విన్నానే. వాడాదుకోలేదూ"

"ఆడిందిగానీ, దీంతో వేగలేక దాని అలవాట్లు మాన్పలేక వేసారి, మతి చలించి, చెప్పకుండా హృషీకేశం వెళ్లి పోయాడు. మరి తిరిగి రాలేదు".

() — ()